మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# వ్యక్తి ఆత్మహత్య

**ఝరాసంగం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** మద్యానికి అలవాటు పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు మందలించడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన ఝరాసంగంలో మంగళవారం రాత్రికి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పంచలింగాల గ్రామానికి చెందిన కోమరి దుర్గయ్య (45) తన కుటుంబ సభ్యులతో కలిసి ఝరాసంగంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గయ్య మద్యానికి బానిసై నిత్యం తాగుతూ ఆరోగ్యాన్నిపాడు చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా చితికి పోయాడన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటికి తాగొచ్చిన దుర్గయ్యను భార్య ఎల్లమ్మ, పిల్లలు మద్యం తాగొద్దని సూచించారు. జీవితంపై విరక్తి చెందిన దుర్గయ్య రాత్రికి ఇంట్లోని బాత్‌రూంలో లుంగితో రాడ్‌కు ఉరిరవేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి సోదరుడు కొమరి లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్‌రెడ్డి వివరించారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**కొమురవెల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు మల్లేశంగౌడ్ ప్రతి రోజూ మాదిరిగానే వ్యవసాయ బావి వద్దకు సోమవారం ఉదయం వెళ్లినట్లు తెలిపారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టపక్కల గ్రామాల్లో బావి వద్ద ఎంత చూసిన అచూకీ లభించలేదన్నారు. మంగళవారం ఉదయం వ్యవసాయ భూమి పక్కనే వ్యవసాయ భూమి కలిగిన కాగిత మోహన్‌రెడ్డి షెడ్డులోని మంచంపై పడి ఉన్నట్లు తెలిపారు. తన భర్త మరణంపై ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని మన స్థాపానికి గురై ఏదైనా పురుగుల మందు తాగనాడేమోనని అనుమానం వ్యక్తం చేశారు. మృతిని భార్య అరుణ ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి ధృవీకరించుకుంటాం

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**మెదక్ అర్బన్, ఏప్రిల్12 ప్రభాతవార్త:** ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోమారు పరిశీలించి ధృవీకరించుకుంటామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుండి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్‌తో కలిసి కలెక్టర్లతో ఓటర్ జాబితాలో పీఎస్ఈ (ఫోటో సిమిలర్ ఎంట్రీస్) ధృవీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, బూత్ లెవెల్ అధికారుల నియామకం అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మరోమారు క్షేత్ర స్థాయిలో పరిశీలించి జిల్లాలో మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, ఫోటోలు మిస్ మ్యాచ్ అయిన వివరాలను ధ్రువీకరించుకుంటామన్నారు. కాగా జిల్లాలో 583 ఓటర్ల పేర్లు తొలగించామని, తిరిగి వాటిని ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు డాక్యు మెంట్లు అన్ని ఉన్నాయో, లేదో పరిశీలించి ఏ మాత్రం లోపాలకు తావు లేకుండా పక్షం రోజుల్లో అప్‌డేట్ చేస్తామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రమేష్, ఆర్డీవో సాయిరాం, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటిక్రాంతి కిరణ్ తదితరులు

**మునిపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** కంకోల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతోగానో కృషి చేశారని, ఆయన ఆశసాధనకోసం ప్రతి ఒక్కరూ పాటు పాడాలన్నారు. తాను అంబేద్కర్ రచించిన రిజర్వేషన్ మూలంగానే ఆందోల్ ఎమ్మెల్యేగా అవకాశం కలిగిందన్నారు. అలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైతర మీనాక్షి,ఎంపిపి శైలజ,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్,సీనియర్ నాయకుడు శివశంకర్, సర్పంచులు విశ్వనాథం, రమేష్, రైతుబంధు మండల అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్న వీరయ్యస్వామి, మాజీ సర్పంచ్ రాములు, అబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కేసుల ఛేదనలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలి

**ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**

**మెదక్ రూరల్, ఏప్రిల్12 ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించేందుకు కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బుధవారం జిల్లా ప్రధాన కార్యాలయంలో జిల్లా సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలని, కేసు నమోదు నుండి ఛార్జిషీట్ వచ్చే వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశీలించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసుటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి, ఏయే అంశాలను క్రోడీకరించాలని తదితర అంశాలను వివరించారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా ఛేధించాలన్నారు. కేసుల ఛేధనలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ కొత్తగా వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని కేసును త్వరగా పూర్తిచేయాలన్నారు. సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని సంబంధిత ఎస్ఐలకు సూచించారు. నాన్ బెయిల్ వారెంట్‌లు త్వరగా ఎగ్జిక్యూటీవ్ చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మెదక్, తూప్రాన్ డీఎస్పీలు సైదులు, యాదగిరిరెడ్డి, ఆర్ఐ నాగేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ దిలీప్‌కుమార్, శ్రీదర్, ఎస్‌బీ ఎస్ఐ రమేష్, ఐటీ కోర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

## రాజీవ్ రహదారిపై రోడ్డు భద్రతా చర్యలు

# పకడ్బంధీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో వంటి మామిడి నుంచి బెజ్జంకి ఎక్స్ రోడ్డు వరకు రాజీవ్ రహదారిపై రోడ్డు భద్రతా చర్యలను పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన సీపీ శ్వేతతో కలిసి మాట్లాడారు. రహదారి భద్రత జీవితానికి రక్షణ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సేఫ్టీ మేజర్స్ తీసుకోవాలన్నారు. వాహనాదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపైన ప్రమాదాలు జరిగినప్పుడు 108 వాహనాల సేవలు అందించిన వివరాలను ప్రతి నెల ట్రాఫిక్ ఏసీపీకి అందజేయాలన్నారు. 108లో ఈఎంఆర్ఐ కేసులకు గానూ సీపీఆర్ శిక్షణ త్వరలో ప్రారంభిస్తామన్నారు. రోడ్డు భద్రత కమిటీ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో అధికారులు ఎప్పటికప్పుడు రిపోర్టులను పెట్టాలన్నారు. అర్‌అండ్‌బి, మున్సిపల్ ఇతరత్రా రహదారుల్లో సగానికిపైగా టూ విలర్ వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంటిమామిడి జంక్షన్‌లో ప్రమాదాల నియంత్రణకు సంబంధించి ఎలాంటి సదుపాయాలు కల్పించనందుకు హెచ్‌కెఆర్ అథారిటీ వారిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మీరు చేసే నిర్లక్ష్యం వలన నిండు ప్రాణాలు బలి అవుతున్నాయని ఎట్టి పరిస్థితుల్లో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వచ్చే మార్గంలో కొమురవెల్లి చౌరస్తా, దుద్దెడ ఎక్స్ రోడ్డు వద్ద ప్రజలు బస్సు కోసం నిలపడానికి స్థలం లేదని కొమురవెల్లి చౌరస్తాలో భక్తులు తీవ్రంగా ఇబ్బందికి గురి కాకుండా మినీ బస్టాండ్ ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్‌లు గుర్తించి వాటి వద్ద తప్పనిసరిగా సేఫ్టీ మెథడ్స్ పాటించాలన్నారు. కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిద్దిపేట-ఎల్కతుర్తి, మెదక్-సిద్దిపేట, సిరిసిల్ల-జనగాం నేషనల్ హైవే పనులు చేపడుతున్న ఏజెన్సీలు ఐఅర్పీ నిబంధనలు ప్రకారం ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీ శ్వేత మాట్లాడుతూ హెచ్‌కెఆర్,ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ ఈఈలు, ఏసీపీలు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, దేవారెడ్డి, రమేష్, సతీష్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, అర్టీసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

# జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

**జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 3.31 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడం జరిగిందని దిగుబడి 7,97,219 మెట్రిక్ టన్నుల ధాన్యం దీంట్లో రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్లకు పోను 6,00,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు మద్దతూ ధరపై బుధవారం కలెక్టరేట్‌లో 2022-23 వరి ధాన్యం సేకరణ పై సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఐకెపి 219, పిఎసిఎస్ 192, మెప్మా 5 మొత్తం 416 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో ప్యాడి క్లీనర్లు, వేయింగ్ స్కేల్, మాయిశ్చర్ మీటర్, టార్పాలిన్లు ఖచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేంద్ర నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు గల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులను చైతన్యపర్చాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు రాకుండా మంచినీటి సదుపాయం, నీడ, తాత్కాలిక మరుగుదొడ్లు, కరెంటు సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన గన్నీ బ్యాగులను సమకూర్చుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 2021-22 యాసంగి సిఎంఆర్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. యాసంగి 2021-22 పెండింగ్ ఉన్న అందరూ మిల్లర్లు తమ సిఎం డెలివరీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితులలో గడువు పొడిగింపు లేదన్నారు. సమావేశంలో డిసిఎస్ఓ బ్రహ్మారావు, డిసివో ఇంచార్జి డిఅర్‌డివో చంద్రమోహన్‌రెడ్డి, డిఎంవో రియాజ్, వ్యవసాయ, రవాణా, పౌర సరఫరా అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా

# ధాన్యం కొనుగోళ్లు జరగాలి

**-ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

**మెదక్ రూరల్, ఏప్రిల్12 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ద్వారకా గార్డెన్‌లో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని రైతులకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఉచిత విద్యుత్, సాగునీరు. రైతుబంధు, రైతుభీమా తదితర పథకాలతో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. దళారీల ప్రమేయం లేకుండా రైతులకు మద్దతు ధర ప్రకటించడం ద్వారా రైతులకు ధైర్యం కల్పిస్తుందన్నారు. అధికార యంత్రాంగం అన్ని శాఖ సహకారంతో సమిష్టిగా కృషి చేస్తూ సమన్వ యంతో రైతుల ధాన్యం కొనుగోళ్లలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తూకం సరిగ్గా చేయలేదని, తాలు ఉన్నాయని, గోనె సంచులు బాగోలేవని, లారీ సమస్యలు ఉన్నాయని, రైస్ మిల్లర్లు వడ్లను దించుకోవడం లేదని తదితర సమస్యలు గతంలో ఉత్పన్నమవ్వడం వల్ల వాటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అధికారులు అటవీ భూముల్లో పండించిన ధాన్యంపై వ్యవసాయ అధికారులు పంట వివరాలు తెలుసుకొని ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి రైతుల అభిమానాన్ని చూరగోనాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఈ యాసంగిలో 4 లక్షల 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, ఐకేపీ సంస్థల ఆధ్వర్యంలో 406 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదివరకే ఇందుకు సంబంధించిన అధికారులతో సమీక్షలు నిర్వహించామన్నారు. ప్రతి కేంద్రంలో ఎలక్ట్రానిక్ కాంటలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలినట్లు, తేమను కొలిచే యంత్రాలు, గోనె సంచులు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసి నిర్ధేశించిన సమయంలో కొనుగోళ్లు జరిపి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. జిల్లాలోని 35 బాయిల్డ్ మిల్లులకు ధాన్యం తరలించేలా రవాణా వ్యవస్థను సక్రమంగా నిర్వర్తించి కేంద్రం నుండి మిల్లులకు లారీలను పంపుతూ రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా ట్యాబ్ ఎంట్రీలు వెనువెంటనే పక్కాగా చేయాలన్నారు. ఈ ప్రక్రియపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కనీస మద్ధతు ధర ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2060, సాధారన రకానికి రూ.2040 ప్రకటించిన గోడ పత్రికను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు చంద్రపాల్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో శ్రీనివాస్ జిల్లా వ్యవసాయ అధికారి ఆశకుమారి, జిల్లా సహకార అధికారి కరుణ, డీఎస్పీ సైదులు, ఆర్డీవో సాయిరాం, జిల్లా పరిషత్ సీఈవో శైలేష్, డీపీవో సాయిబాబా, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐకేపీ సిబ్బంది, పాక్స్ చైర్మన్లు, రైస్ మిల్లర్లు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఫోటో6: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ ఇళ్ల సర్టిఫికెట్లు : ఎమ్మెల్యే

**వెల్దుర్తి, ఏప్రిల్12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే లేని విధంగా రాష్ట్రంలో పేదల సొంతింటి కళ సాకారం చేసేందుకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించడం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వెల్దుర్తి పట్టణంలో రోడ్డు వెడల్పు కోసం ఇండ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలోని పంతులుపల్లిలో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే మానెపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో కోసేవ సంస్థ వారు అందించిన ఫర్నీచర్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే పంచాయితీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కేక్ కట్ చేసి పంచాయితీ కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కళ సాకారం చేసేందుకు ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు. అనంతరం గ్రామ శివారులో వెలసిన శ్రీ గోనె మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా జాతన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఎంపీపీ స్వరూప,జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, ఆర్డీవో శ్యాంప్రకాష్, తహశీల్దార్ నాగవర్ధన్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ అశోక్ గౌడ్ పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇండ్ల సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



అందోలులో ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి హరీష్‌రావు, హాజరైన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



## బిఆర్ఎస్ హయాంలోనే

# రైతుల్లో ఆనందం

**రాష్ట్ర ఆర్థిశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు**

**జోగిపేట, ఏప్రిల్, 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఆధ్వర్యంలోనే అందోలు నియోజకవర్గం పసిడిపంటలతో కళకళలాడుతుందని, రైతులు రెండు పంటలు వేసుకుంటూ సంతోషంగా ఉన్నారని, అందరి సంక్షేమంకోసం పాటుపడేది ముఖ్యమంత్రి కేసిఆర్ ఆధ్యర్యంలోని బిఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారంనాడు అందోలులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో నిర్వహించిన బిఆర్ఎస్ అందోలు బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిద్యం వహించి, ఉపముఖ్యమంత్రి స్థాయిలో ఉండికూడా ఇక్కడి రైతాంగాన్ని విస్మరించారని విమర్శించారు. కనీసం లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కూడా పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కానీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రధానంగా వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ, బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే సింగూరు నుంచి కాలువలు పూర్తిచేసి చెరువులను నింపటంతోపాటు రేణుకా ఎల్లమ్మ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయటం జరిగిందన్నారు. తద్వారా వేల ఎకరాలను సాగులోకి తీసుకురాగలిగామని తెలిపారు. అంతేకాకుండా రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని, గతంలో మాదిరిగాకాకుండా ఎరువులకోసం రైతులు ధర్నాలకు దిగే పరిస్థితిలేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసి రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని, ఉచిత కరెంటును ఏలాంటి కోతలులేకుండా అందిస్తున్నామని అన్నారు. తెలంగాణలో 56లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారని అన్నారు. సాగునీరు సమృద్ధిగా అందుతుండటంతో వరిధాన్యం అనుకున్నదానికన్నా ఎక్కువమొత్తంలో వస్తుందని, యాసంగిలో కూడా రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్ మాట్లాడుతూ కార్యకర్తల కృషితోనే ఈ రోజు తాను ఈ స్థాయిలో ఉన్నానని, కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే వెన్నెముఖలాంటివారని పేర్కొన్నారు. పార్టీలో ఎలాంటి ఇబ్బందులున్నా వాటన్నింటిని పరిష్కరించుకుని మనమంతా కలిసికట్టుగా పనిచేద్దామని అన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడాలేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని, బృహత్తరమైన సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి కేసిఆర్ తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. అందుకని భవిష్యత్తులోకూడా ప్రజలు బిఆర్ఎస్‌కు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు బి.బి. పాటిల్, మున్సిపల్ ఛైర్మెన్ మల్లయ్య, ఎంపిపి బాలయ్య, ఆత్మ కమిటి ఛైర్మెన్ యాదగిరిరెడ్డి, డిక్కీ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్‌కిరన్, జాగృతి రాష్ట్ర నాయకులు మఠం బిక్షపతి, మాజీ ఎఎంసి ఛైర్మెన్లు మన్‌సాన్‌పల్లి మల్లిఖార్జున్ గుప్త, పి.నారాయణ, డి.బి.నాగభూషణం, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డిలతోపాటు పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటి సిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవం**

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు బుధవారంనాడు అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో పర్యటించిన సందర్భంగా అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్, ఎంపి బీ.బీ.పాటిల్, జిల్లా పరిషత్ ఛైర్మెన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్‌లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయటంతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జాతీయ రహదారి నుంచి అందోలు వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులకు, జోగిపే బహదూర్‌ఖాన్ ఫంక్షన్‌హాలులో అదనపు నిర్మాణం పనులకు, అందోలులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద యోగా కేంద్రానికి, అందోలు చెరువు సుందరీకరణ పనులకు, అందోలు చెరువు వద్ద నిర్మాణం చేపట్టనున్న దోభీఘాట్‌కు, జోగిపేటోలోని గౌని చౌరస్తా వద్ద సిసి రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. వీటితోపాటు అందోలు-జోగిపేటలలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు, జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్, జోగిపేటలోని నేతాజీ పార్కులో ఓపెన్ జిమ్, జోగిపేటలో ఆధునీకరించిన క్లాక్‌టవర్, అందోలులో నూతనంగా నిర్మించి బస్తీ దవాఖానలను ప్రారంభోత్సవం చేశారు.



రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, బిసి కమిషనర్ బూర వెంకటేశంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

## సిద్దిపేట కుమ్మర పైలెట్ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలి

**బిసి కమిషనర్‌ను కలిసిన కుమ్మర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీను**

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచన మేరకు బిసి కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ బూర వెంకటేశంను బుధవారం హైదారాబాద్‌లో కుమ్మర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సిద్దిపేటలో కుమ్మర్ల కోసం నిర్మించబోతున్న కుమ్మర పైలెట్ ప్రాజెక్టుకు నిధులు త్వరగా విడుదల చేయాలని కోరినట్లు దరిపల్లి శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా బిసి కమిషనర్ బూర వెంకటేశం తప్పకుండా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కుమ్మర్ల సంఘం నాయకులు నెల్లుట్ల విజయ్, మూడపల్లి భూమయ్య, కట్కూరి రవీందర్, కొలిపాక సంపత్ తదితరులు ఉన్నారు.

**పంచాయతీ అధికారి వైఖరికి నిరసనగా**

## మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ

**కొమురవెల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** పంచాయతీ అధికారి మంజుల వైఖరికి నిరసనగా బధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించినట్లు మండలపరిధిలోని కిష్టంపేట సర్పంచ్ జీవనపల్లి కరుణాకర్ తెలిపారు. పంచాయతీ అధికారి మంజుల గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులు రాకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. పంచాయతీ సిబ్బంది నెల జీతాలు, ట్రాక్టర్ బిల్లులు, డీజిల్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పంచాయతీ అధికారి నిరంకుశ వైఖరిని ఎండగడుతూ మండల సర్వసభ్య సమావేశం బహిష్కరించినట్లు వివరించారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రచయితలకు సన్మానం చేస్తున్న దృశ్యం

**నంగునూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఉమాపతి అన్నారు. బుధవారం నంగునూర్ శాఖ గ్రంథాలయంలో బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రాధాన్యం పొందిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శుల అదేశాలమేరకు ముందస్తుగా బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడకులు నిర్వహించమన్నారు. అనంతరం కవులు కల్లూరి యాదయ్య, తెలంగాణ ఉద్యమంలో అనేక కవిసమ్మేళనలు నిర్వహించిన వ్యక్తి రచయిత సొప్పరి రాములును సన్మానం చేశారు. కార్యక్రమంలో దేవులపల్లి పెంటయ్య, పొల్సాని సుధాకర్, ఉమాకాంత్, కనకరాజు, గ్రంథాలయ సిబ్బంది సుద్దాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం అన్నిటికంటే ముఖ్యం

**-జూనియర్ సివిల్ జడ్జి శివరంజని**



రోగులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శివరంజిని

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 12,ప్రభాతవార్త :** ఆరోగ్యం అన్నిటికంటే ముఖ్యం అని జూనియర్ సివిల్ జడ్జ్ శివరంజిని అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆమె న్యాయవాదులతో కలసి మొక్కలు నాటి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో ఇటీవల ఏర్పాటు చేసిన దయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యసౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి న్యాయసూచనలు చేయడానికి రాలేదని, అన్నింటి కంటే ముఖ్యమైనది ఆరోగ్యం అని ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలమన్నారు. ప్రస్తుతం ప్రతీది రసాయనాలతో కల్తీమయంగా ఉందని, తినే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు శాయశక్తులు వారి ప్రాణాలు కాపాడేందుకే ప్రయత్నిస్తారని, రోగి చనిపోతే ఎవరూ బాధ్యులు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ రమేష్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి పనులకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపిపి

**హుస్నాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** మండలంలోని జిల్లలగడ్డ గ్రామం నుండి మీర్జాపూర్ వెళ్లేదారిలో బ్రిడ్జినిర్మాణానికి బుధవారం ఎంపిపి లకావత్ మానససుభాష్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజూరైన బ్రిడ్జి అంచనా విలువ రూ. 40 లక్షలన్నారు. కాంట్రాక్టర్ పనులను నాణ్యతతో చేయడంతోపాటు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లలగడ్డ సర్పంచ్ లావుడ్య స్వరూప లింగానాయక్, మీర్జాపూర్ సర్పంచ్ తరాల లతమహేందర్, పంచాయతీ రాజ్ డిఈ సదాశివ, ఏఈ స్నేహ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే

**కాంగ్రెస్ పార్టీ నేత వీరారెడ్డి**

**శివ్వంపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని, ఆ పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వీరారెడ్డి బుధవారం మాట్లాడుతూ అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజానికానికి పూర్తి న్యాయం చేయడమే కాకుంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని వీరారెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుతం అధికార పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాలంలో ప్రజలందరికీ అనేక పథకాలు అందిన విషయం తెలిసందేనన్నారు. రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. మెదక్ జిల్లాతో పాటు నర్సాపూర్ నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గం నుండి ఏ అభ్యర్థికి స్థానం కల్పించినా గెలుపుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితారెడ్డి గ్రామంలో కూడా కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని గంగిరెడ్డి వీరారెడ్డి అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# అవగాహనతో పైలేరియా వ్యాధి నివారించవచ్చు

**జడ్పీ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ**



స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

**చిన్నకోడూరు, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** అవగాహనతో పైలేరియావ్యాధి నివారించవచ్చని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరులో బుధవారం పైలేరియా కిట్టును బాధితులకు అందజేసి మాట్లాడారు. దోమ కాటుతో ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. బోధకాలు వ్యాధిగ్రస్తులకు ప్రభుత వ్వం రూ.2 వేల పెన్షన్ అంది స్తుందన్నారు.

**కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

కంటి వెలుగు శిబిరాలను 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లాపరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని పెద్దకోడూరు, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం కంటివెలుగు శిబిరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరం ఉంటే వెంటనే అద్దాలు ఉచితంగా పంపిణీచేయడం జరుగుతుందన్నారు. కంటి వెలుగు పథకం దేశానికే అదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండలపరిధిలోని పెద్దకోడూరు, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగిస్తే అనారోగ్య సమస్యలతో పాటు క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు మాత్రమే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వనతి రవీందర్‌రెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షులు పాపయ్య, రైతు సమస్వయ జిల్లాసభ్యులు మేడికాయల వెంకటేశం, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాముని ఉమేష్‌చంద్ర, ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ కుంటయ్య, సర్పంచ్ బట్టు లింగం, ఎంపిటిసి సాయన్న, కాల్వ ఎల్లయ్య, లింగమూర్తి, స్వర్ణలత శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, బాలనర్సు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో కెక్ కట్ చేస్తున్న దృశ్యం

## జూనియర్ పంచాయితీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం

**రాయపోల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** జూనియర్ పంచాయితీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల ప్రొబెషన్ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా క్రమబద్ధీకరించుటకై సిఎం కేసిఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బుధవారం రాయపోల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపిడి సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎనలేనిదన్నారు. జూనియర్ పంచాయితీ కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2019 ఏప్రిల్ 11న జూనియర్ పంచాయితీ కార్యదర్శుల నియామకాలు చేపట్టారని, అప్పుడు సంవత్సరాల ప్రొబెషన్ కాలాన్ని మాత్రమే నిర్ణయించారని మళ్లీ కాలాన్ని సంవత్సరం పొడిగించినప్పటికి 2023 ఏప్రిల్ 11తో నాలుగు సంవత్సరాలు ప్రొబెషన్ కాలం పూర్తయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నామన్నారు. నాలుగు సంవత్సరాల ప్రొబెషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలన్నారు. ఓపిఎస్‌లను జెపిఎస్‌లగా మార్చాలన్నారు. గత రెండు నెలలుగా వేతనాలే చెల్లించలేదని, వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి అనిత, ఎంపీడీవో మునయ్య, ఎంపివో లక్ష్మినారాయణ, గ్రామ సర్పంచ్ మౌనికరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన ఏఓ

**మర్కుక్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి ఏఈఓలు రజినికాంత్, విష్ణువర్ధన్‌లతోకలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో మొగి పురుగు ఎక్కువగా ఆశిస్తుందని అన్నారు. నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే ఆనిన తర్వాత తెల్లకంకులు బయటకు వస్తాయన్నారు. ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం, కరువు పరిస్థితులు, తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు ఉండి సూర్యరశ్మి రోజుకు 7 గంటలు కంటే ఎక్కువ, నత్రజని తక్కువగా వాడటం వల్ల కాండం బలహీనం కావడం జరుగుతుందన్నారు. ఆ పురుగు ఆశించడానికి అనుకూలం ముఖ్యంగా యాసంగి వరి పైరులో ఎక్కువగా ఆశిస్తుందన్నారు. కావున రైతులు వరి నాటిన 10 నుండి 15 రోజుల మధ్యలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 4 కిలోలు లేదా బరోజ్ 3 కిలోలు గుళికలు లేదా ఫ్లుబెండమైడ్ గుళికలు 5 కిలోలు లేదా పిప్రోనిల్ 6 కిలోల గుళికలు 10 కిలోల ఇసుకలో కలిపి తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

**దుబ్బాక, ఏప్రిల్ 12, ప్రభాతవాత్త:** నాలుగు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని దుబ్బాక ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి, జడ్పిటిసి కడతాల రవిందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చింతల జ్యోతికృష్ణ, ఎంపిడిఓ భాస్కర వర్మలకు దుబ్బాక మండల గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. గ్రామ పంచాయతీల జూనియర్ కార్యదర్శులు 4 సంవత్సారాల ప్రొబేషనరీ కాలాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా దుబ్బాకలో ఎంపిడిఓ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళన నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథులుగా దుబ్బాక ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి, జడ్పిటిసి కడతాల రవింధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చింతల జ్యోతికృష్ణలు హజరైయారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామంలో గత నాటుగు సంవత్సరాలుగా విధులు నిర్వహించడం జరుగుతుందని, ప్రజాలకు సేవ చెయడంతో పాటుగా గ్రామంలో సానిటేషన్, వీది దీపాలు, ఇతర సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులను తెలంగాణ సర్కార్ గుర్తించి క్రమబద్దీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపిపి, జడ్పిటిసి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం



చేబర్తిలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**-ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**మర్కుక్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త):** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చేబర్తిలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన చేబర్తి క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రతాప్‌రెడ్డి ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికొల్లాసంతోపాటు శరీర దృఢత్వం కలుగుతుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం హయాంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మర్కుక్ సర్పంచ్ భాస్కర్, ఎంపిటిసి గోలి నరేందర్, ఉపసర్పంచ్ స్వామి, మహనీయుల కమిటీ మండల ఆర్గనైజర్ చిన్నికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రమణీయంగా వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

**కొండపాక, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** దుద్దెడలోని వేణుగోపాల సహిత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు బుధవారం నాటికి ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో మూడవ రోజున మూలమంత్రి హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా అలివేలుమంగా పద్మావతి సహిత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట స్వయంభూ శంభు దేవాలయం నుండి శ్రీవెంకటేశ్వరస్వామి ఎదుర్కోలు తంతు జరిపించారు. అనంతరం ఆలయంలో అత్యంత సుందరంగా అలంకరించిన కల్యాణ వెదికపై అలివేలుమంగా, పద్మావతి సమ్మేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం జరిపించారు. కన్యాదాతలుగా మంచాల విజయలక్ష్మి శ్రీనివాస్ దంపతులు వ్యవహరించగా, త్రిపాటి నారాయణమూర్తిశర్మ కోట శ్రీనివాస శర్మ, వేలేటి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శ్రీవారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ అరెపల్లి మహదేవ్, గోపాల్‌రెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, పబ్బోజు రాజయ్య కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మూల విగ్రహలకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గొనె శ్రీనివాస్, చింతకింది రఘు, జంగిటి బాబు, సుంచు ఉపేందర్, శివాజీ, పెద్ది శంకరయ్య, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచన విధానంలోనే సిఎం కెసిఆర్ పరిపాలన

**రైతుబంధు రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్**

**కొండపాక, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో దేశంలోనే ఎత్తయిన భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ సందర్శించారు. బుధవారం సర్పంచ్ పెర్క కల్పన, స్వామి, మాజీ సర్పంచ్ బొడపట్ల ఐలం శివ, గౌటి అనిల్‌తో కలిసి మాట్లాడుతూ హైదరా బాద్‌లోని హుస్సేనసాగర్ పక్కన 125 అడుగు ఎత్తయిన భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయడం సంతోషించతగ్గ విషయమన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానంలోనే సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నరని కొనియాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని అర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సీఎం కేసీఆర్ చాలా సందర్భంల్లో ప్రకటించారని తెలి పారు. దేశంలోనే ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటుచేసి అంబేద్కర్‌పై, రాజ్యంగం పై ఉన్న కృతజ్ఞతభావాన్ని చాటుకున్న సీఎం కేసీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యంగం రాసిన మహనీయుని విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాడానికి గత ప్రభుత్వాల పాలనలో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వచి ్చందని గుర్తు చేశారు. తెలంగాణ పరిపాలన భవనంకు అంబేద్కర్ పేరు పెట్టడం, హైదరా బాద్ నడిబొడ్డున ఆయన భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈనెల 14న అంబేద్కర్ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ అవిష్కరించనున్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రజలు నలు మూలలనుండి ఆధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించిన నాయకులు

# రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తాం

**ఎఐకెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్తిరెడ్డి**

**కొమురవెల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** రైతాంగ పోరాటంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)ది చారిత్రాత్మకమైన పోరాటమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, రైతు సంఘం నాయకులు నక్కల యాదవరెడ్డి అన్నారు. ఏఐకేఎస్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కొమురవెల్లి, ఐనాపూర్ గ్రామాల్లో ఏఐకేఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం స్వాతంత్ర్యానికి పూర్వం 1936లోనే ఏఐకేఎస్ ఏర్పడిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసిన ఘనత ఏఐకేఎస్‌కే ఉందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రైతు వ్యతిరేక చట్టాలపై జరిగిన పోరాటంలో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. పార్లమెంటులో రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం తేవాలని విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. నరేంద్రమోడీ పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

మోడీ కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ పేదలకు అన్యాయం చేస్తు న్నారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలు పరి ష్కారం అయ్యే వరకు అమరవీరుల అశయాలకు అనుగుణంగా ఏఐకేఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, పుల్లంపల్లి సాయిలు, కానుల రాజు, కనకయ్య, పాశం చంద్రయ్య, భిక్షపతి, కర్రోల ఎల్లయ్య, దాసరి మహేష్, తాడూరు నరేష్, సార్ల యాదయ్య, దాసరి బాలస్వామి, పాకనాటి భాను, ఏసు రవీందర్, పగనాటి మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐకెఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



వైశ్య సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

## సమాజ సేవలో వైశ్యులు ముందుండాలి

**-ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్**

**మెదక్ రూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** సమాజ సేవలో వైశ్యులు ముందుండాలని ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆదేశాల అనుసారం మెదక్ పట్టణ ఆర్య వైశ్య సంఘ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం కుమ్మరిగడ్డ హనుమాన్ మందిరంలో జరిగింది. అధ్యక్షులుగా మెడిశెట్టి శ్యామ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పార్థినాథ్, కోశాధికారిగా కామిని రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మెదక్ పట్టణంలో ఆర్య వైశ్య సంఘం ఒక్కతాటిపై ఉండి చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. తోడుపునూరి వెంకటేశం అకాల మృతితో ఈసారి పట్టణ ఆర్య వైశ్య సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, వైఎస్ఆర్‌టీపీ యూత్ జిల్లా అధ్యక్షులు వనపర్తి రోహిత్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ పురం నారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెడిశెట్టి శంకర్, సంఘ ప్రతినిధులు లక్ష్మీపతి, జగదీశం, గంగ వెంకటేశం, గోలి కుమార్, లక్ష్మీనారాయణ, మురళి, వీరేశం, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాగి వనజ, కొత్త పద్మ, ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన ఎంపి ప్రభాకర్‌రెడ్డి

**మిరుదొడ్డి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ధర్మారం శివారులో ట్రాక్టర్ బావిలో పడ్డ సంఘటనలో గాయపడి సికింద్రాబాద్ యశోదా అసుపత్రిలో చికిత్సపొందుతున్న గల్ల దుర్గయ్యను బుధవారం మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## ఉసిరికపల్లి పాఠశాలలో మజ్జిగ పంపిణీ

**శివ్వంపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు రాంగారి సుధాకర్ తల్లి వెంకటలక్ష్మీ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి కె. బుచ్చానాయక్, సర్పంచి బాబురావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరి వీరేశం, విద్యా కమిటీ చైర్మన్ కుందెనపల్లి కృష్ణ, వార్డు సభ్యులు సురేందర్‌రెడ్డి, వేణుకుమార్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల, అమరేందర్‌రెడ్డి, గోపాల్, శ్యామ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బిక్యా తండాలో 'కంటివెలుగు' ప్రారంభం

**శివ్వంపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిక్యా గిరిజన తండా గ్రామ పంచాయితీ పరిధిలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచి సుమలత రాజ్‌కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సూర్యం చౌహాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి సుమలత రాజ్‌కుమార్ సూచించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందుల, కంటి అద్దాలు అందజేస్తారని ఆమె తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని చెప్పారు. వైద్యుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, ఉప సర్పంచి కిషన్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు మోహన్ నాయక్, విజయసింగ్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## భద్రాద్రి తలంబ్రాల అందజేత

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ఇటీవల శ్రీరామ నవమి సందర్భంగా ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భద్రాద్రి సీతారాముల కళ్యాణ తలంబ్రాలను బుకింగ్ చేసుకున్న భక్తులకు బుధవారం అందజేశారు. పెద్దశంకరంపేట ఆర్టీసీ ప్రాంగణ పరిధిలో బుకింగ్ చేసుకున్న 150 మందికి ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మారుతి భక్తుల దగ్గరకు వెళ్లి తలంబ్రాలను అందించారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**దుబ్బాక, ఏప్రిల్ 12, ప్రభాతవాత్త:** మెదక్ ఎంపి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే దుబ్బాక పట్టణం అభివృద్ధి చెందుతుందని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు గుడెల్లి ఎల్లా రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణం పరిధిలో ధర్మాజీపేట వార్డులో రూ.నాలుగున్నర కోట్లతో బీటి రోడ్డు పనులను కౌన్సిలర్లు బత్తుల స్వామి, దీవిటి కనకయ్య, దుబ్బాక బాలకిషన్ గౌడ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్‌తోనే దుబ్బాక అభివృద్ధి చెందుతుందన్నారు. దుబ్బాకను అభివృద్ధి చేసేది బిఆర్ఎస్ పార్టీ మంత్రి హరీష్ రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి అయితే చేసింది లేదు కాని చెప్పుకు తీరిగేది బిజెపి అని మండిపడ్డారు. దుబ్బాక పట్టణం అభివృద్ధి చెందుతుంటే అది ముమ్మటికి బిఆర్ఎస్ సర్కార్ కృషే నన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గన్నె భూంరెడ్డి, ఆస స్వామి, పర్స కృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, ఎంగారి రాజిరెడ్డి, లొంక లచ్చయ్య, వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటాం

**మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్**

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలో ఇకపై ఎక్కడైనా బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే సీసీ కెమెరాల ద్వారా చెత్త వేసిన వారిని గుర్తించి చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం అయన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో ఎక్కడ కూడా బహిరంగ ప్రదేశాలతో పాటు నివాస ప్రాంతాల్లో చెత్త వేయడం సరికాదని పట్టణ పరిశుభ్రత మనందరి బాధ్యత అన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపిపి

**దుబ్బాక, ఏప్రిల్ 12, ప్రభాతవాత్త:**

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా బిఆర్ఎస్ సర్కార్ పనిచేస్తుందని ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి అన్నారు. మెదక్ ఎంపి, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాలమేరకు బుధవారం దుబ్బాక మండల పరిధిలో పోతారం గ్రామంతో పాటుగా నర్లేన్‌గడ్డలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గడిల్ల జనార్ధన్ రెడ్డి, దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చింతల జ్యోతికృష్ణ, జడ్పిటిసి కడతాల రవిందర్ రెడ్డి, వైద్యాధికారిని డాక్టర్ హిమబిందులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ ఎంతో ఖర్చు పెట్టి గ్రామంలో ఉచితంగా కంటి శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కంటి వెలుగు శిబిరాన్ని గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగించుకుని ఆరోగ్య కరమైన చూపు పొందాలని ప్రజలను కోరారు. సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బానాల శ్రీనివాస్, ఎంపిటిసి రధామనోహర్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచులు సందిరి ఇస్తారి, రెడ్డబోయిన మాదవిస్వామి, పంచాయతీ కార్యదర్శి అజయ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కల్వకుంట రాజు, ఏఎన్ఎంలు సాయిలీల, జమున, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు సొడు స్వామి, ఎమ్మ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో మున్సిపల్ చైర్మన్ మల్లపల్లి లలితా సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ఆరగించారు. ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్పనగేష్ యాదవ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ప్రొహిబిషనరీ ముగిసింది.. క్రమ బద్దీకరరించండి




ఎంపిపి ఉపాధ్యక్షులకు వినతి పత్రం అందచేస్తున్న పంచాయితీ కార్యదర్శుల దృశ్యం

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** నాలుగు సంవత్సరాల ప్రొహిబీషనరీ పూర్తయినందున తమను వెంటనే క్రమ బద్దీకరించాలని పంచాయితీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉపాధ్యక్షులు పండరి యాదవ్‌కు పంచాయితీ కార్యదర్శులు బుధవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామి మేరకు ఇంత కాలం విధులు నిర్వహించామన్నారు. ప్రభుత్వం చేసిన హామిని వెంటనే అమలు చేసేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను వెంటనే అమలు చేయకుంటే ఈ నెల 12వ తారీఖు నుంచి 28వ తేదీ వరకు నిరవధిక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శుల సంఘం నాయకులు బల్వంత్‌రెడ్డి, దత్తురెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

### నేడు సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమం

**న్యాల్‌కల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఈ నెల 13వ తారీఖున మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శ్వేతప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆరోగ్య శాఖ, అంగన్‌వాడి బాధ్యులకు సిపిఆర్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిషత్‌సభ్యులకు, ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, ఆయా శాఖల అదికారులకు శిక్షణ ఇస్తారన్నారు.

### నిచినో ఇండియా కంపెనీ ప్రారంభోత్సవం



కంపెనీని ప్రారంభిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కీటకనాశిని, శిలీంద్రనాశిని, ఇంట ర్మీడియట్లు, సూత్రీకరణలను ఉత్పత్తి చేసే బహుళ ప్రయోజనల సౌకర్యాలు కల్గిన నిచినో ఇండియా కర్మాగారాన్ని కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో గ్లోబల్ అధ్యక్షులు హిరోహికి ఇవాట శాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్లోబల్ అధ్యక్షులు హిరోహికి ఇవాట శాన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 250 కోట్ల ప్రొప్రైటరీ టెక్నికల్ గ్రేడ్ మెటీరియల్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. కర్మాగారం పర్యావరణానికి అత్యంత సురక్షితం అని, కంపెనీలో డెడికేటెడ్ యాసిడ్ రికవరీ సిస్టమ్, డస్ట్ ఫ్రీ బ్లాకులు, నౌటా డ్రైయర్లు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ లాంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రపంచలోని 100కు పైగా దేశాలలో రైతులకు కర్మాగారాలు ద్వార సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో నితిన్ ఇండియా గ్లోబలన ఉపాధ్యక్షులు కోఉజిపిపిడో, కంపెనీ ప్రతినిధులు కాజు ఇకు ఉ మోటిబో, యాపిటిక తానిమయా, హిడకి హిలో తనుక శాణ్, బిజీ శెట్టి, బ్లీరావు శాన్, హేమంత్ శాన్ తదితరులు పాల్గొన్నారు.

## అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

**కౌడిపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బడుగుబలహీన వర్గాల అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి రాజనాయక్ పేర్కొన్నారు. బుధవారం నాగసనపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపిడీవో శ్రీనివాస్, ఎంపిపిరాజునాయక్, టిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు సారాముడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సదర్భంగా టిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు సారాముడు మాట్లాడుతూప్రతి కుటుంబంలో కంటిసమస్యలు ఉన్న వారు చిక్సిత చేయించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లం ఎంపిటిసి చాలాస్వప్న కిషోర్‌గౌడ్, వైద్య బృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంధత్వ నిర్మూలనకు కంటి వెలుగు

### ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రంలో అంధత్వాన్ని నిర్మూలించేందుకు సిఎం కెసిఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్‌తో కలిసి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు కంటి వెలుగు పథకం ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అంధత్వ నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు స్వామి, స్థానిక ఉపసర్పంచ్ సురేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వ్యక్తిపై కేసు నమోదు

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 12 .ప్రభాతవార్త:**
అక్రమంగా విద్యుత్ వాడుతూ పట్టుబడ్డ వ్యక్తిపై విజిలెన్స్ ఇన్ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు.బుదవారం నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామానికి చెందిన సందిల వెంకటేశ్ అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్నాడని విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న సందిల వెంకటేశ్‌పై కేసును నమోదు చేశారు.

## గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికే గొర్రెల పంపిణీ : ఎమ్మెల్యే

**జహీరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సబ్బండ వర్గాలకు అండగా, కులవృత్తులకు అధిక ప్రధాన్యత ఇస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2వ విడత గొర్రెల పంపిణి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావు సభను ఉద్దేశించి మాట్లాడుతూ గొల్ల కుర్మలకు రెండవ విడత గొర్రెల పంపిణి కార్యక్రమం పారదర్శకంగా కొనసాగాలే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంపిణి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కులవృత్తులకు బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందన్నారు. గొర్రెల పెంపకం రాష్ట్రంలో పెరిగిందని, మాంసం కొరత తీర్చడంతో పాటు గొల్లకుర్మలు ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. పంపిణి చేసిన గొర్రెలకు ఇన్సురెన్స్, దాణా లాంటి సదుపాయాలు సైతం కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సిహెచ్ ఎల్లయ్య, నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎంపిడిఓలు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, డాక్టర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, గొల్ల కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రమేష్



కురుమ సంఘం యువత ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సంగారెడ్డి నియోజకవర్గ కురుమ సంఘం యువత ప్రధాన కార్యదర్శిగా ఇందూరి రమేష్‌ను నియమించారు. సదాశివపేట మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన ఇందూరి రమేష్ కురుమను ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం కురుమ సంఘం జిల్లా యువత అధ్యక్షులు కొల్కూరి ప్రవీణ్‌కుమార్, కొత్తగొల్ల సోమశేఖర్ కురుమలు నియామక ఉత్తర్వులను అందచేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా నియమించిన నాయకులు నమ్మకాన్ని వమ్ము చేయకుండా కురుమల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ పెద్దగొల్ల నగేష్ కురుమ, పెద్దాపురం మాజీ సర్పంచ్ శ్రీశైలం కురుమ, కాశీపురం ఆంజనేయులు కురుమ, సదరు ఉత్సవ కమిటీ సభ్యులు మురళి, కొల్కూరి సంగమేశ్వర్ కురుమ, తుకారం కురుమ, వేణుగోపాల్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**మెదక్ రూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:**
మెదక్ మున్సిపల్‌కాంప్లెక్స్ దుకాణాల రీటెండర్ ఓపెన్ యాక్షన్ వేలం పాట నిర్వహించి ఆ తర్వాత కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఐక్యకార్యాచరణ సమితి నాయకులు బాల్‌రాజ్ మాట్లా డుతూ మున్సిపల్ కమిషనర్ కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించాల్సి న మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలను రీటెండర్ లేదా ఓపెన్ యాక్షన్ వేలం పాట నిర్వహించి కేటాయించాల్సి న విషయంలో నిర్లక్ష్యం చేస్తూ 45 మంది దరఖాస్తు దారులు ఆ కాంప్లెక్స్ దుకాణాల కోసం దరఖాస్తు చేసినప్పటికీ ఎవరికో మేలు చేయడానికి మున్సిపల్ కమీషన్ నిర్లక్ష్యం చేస్తున్నారని అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేలు ఈ విషయంలో జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఆయా దుకాణాల రీటెండర్ ఓపెన్ యాక్షన్ వేలం పాట నిర్వహించాలని, లేనిచో ఎస్సీ, ఎస్టీ, బీసీ, నిరుద్యో, యువజన సంఘాల ఐక్య కార్యా చరణ సమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున దర్నాలు చేస్తామని, దరఖాస్తు చేసుకున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఎక్కువగా ఉండటం వల్ల మున్సిప్ కమీషనర్‌కు అనుకూలంగా ఉన్న వారికి కాంప్లెక్స్ దుకాణాలు అందుతాయో, లేదో అని వివక్షతో మున్సిపల్ టెం డర్ల విషయంలో జాప్యం చేస్తున్నారని, ఇప్పటికైనా తక్షణమే ఓపెన్ యాక్షన్ వేలంపాట నిర్వహించి లబ్ధిదారులకు ఆయా దుకాణాలు వచ్చేలా చేయా లని అన్నారు. ప్రవీణ్‌కుమార్, గోపాల్ నాయక్, ప్రభాకర్, కృష్ణ, రంజిత్‌నాయక్, సుధా కర్, భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హామీలను విస్మరించిన సిఎం కెసిఆర్

### బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**నర్సాపూర్, ఏప్రిల్ 12 .ప్రభాతవార్త:** దళితుల కిచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ విస్మరించారని బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుదవారం నాడాయన నర్సాపూర్‌లోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైద్రాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబెద్కర్ విగ్రహాన్ని దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాకే ఆవిష్కరించాలని సిఎం కెసిఆర్ కు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నికల కోసమే దళితులను వాడుకుంటున్నాడని, ఉధ్యమ సమయంలో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, అధికారంలోకి వచ్చాక దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి అవి నేరవేర్చకుండా దళిత బంధు పేరిట మరోసారి సిఎం కెసిఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు.



ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందచేస్తున్న జూనియర్ పంచాయితీ కార్యదర్శులు

## పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజ్ చేయాలి

**జహీరాబాద్ (మొగుడంపల్లి), మార్చి 12, ప్రభాతవార్త:** గత 5 సంవత్సరాలుగా జూనియర్ పంచాయితీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పంచాయితా కార్యదర్శులు ప్రజాప్రతినిధులకు వినతి పత్రం అందచేశారు. నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ఎంపిపి అధ్యక్షులు ప్రియాంక గుండారెడ్డి, ఉపాధ్యక్షులు హసీనా బేగం, కో-ఆప్షన్ సభ్యులు జమ అర్షద్ పటేల్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శులు మాట్లాడుతూ 2018లో ఉద్యోగంలో చేరిన 2022లోనే తమను రెగ్యూలరైజ్ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఒక సంవత్సరం పెంచినా ఇప్పటికి రెగ్యూలరైజ్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన హామి మేరకు ఏప్రిల్ 11తో తమ విధి నిర్వాహణ 5 సంవత్సరాలు పూర్తయినందున వెంటనే తమను రెగ్యూలరైజ్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

### కార్యాలయంలో కేక్ కటింగ్

జూనియర్ పంచాయితీ అధికారులుగా విధుల్లో చేరి 5 సంవత్సరాలు పూర్తయిన సం దర్బంగా జూనియర్ పంచాయితీ అధికారులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్బంగా ప్రజాప్రతిధులకు పూలు, శాలువాలతో సన్మానించి కేక్‌తో నోటిని తీపి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు ప్రియాంక గుండారెడ్డి, ఉపాధ్యక్షులు హసీనా బేగం, కో-ఆప్షన్ సభ్యులు జమ అర్షద్ పటేల్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కబ్జా స్థలంలో నిర్మాణాల తొలగింపు

### వార్త ప్రభావం



రంజోల్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

**జహీరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన ఆక్రమణ దారులపై రెవిన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... పట్టణ శివారులోని రంజోల్ గ్రామంలో జాతీయ రహదారి పక్కన సర్వేనంబర్ 111లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమణదారులు నిర్మాణాలు ప్రారంబించి స్థలాన్ని కబ్జా చేసేందుకు కుతంత్రాలు పన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జా అవుతున్న విషయాన్ని ప్రభాతవార్త ఈ నెల 6వ తారీఖున ప్రభుత్వ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడండి శీర్షికతో కథనాన్ని వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే. వార్త కథనానికి స్పందించి అధికారులు బుధవారం రంజోల్ గ్రామంలో ఆక్రమణకు గురైన స్థలంలోని నిర్మాణాలను జెసిబి వాహనంలో తొలగింపచేశారు. ఈ సందర్బంగా ఆర్‌డిఓ రమేశ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రమేష్‌బాబు, మున్సిపల్ కమీషనర్ జి మల్లారెడ్డి, తహసీల్దార్ జే స్వామి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు : ఎంపిపి

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 12 (ప్రభాతవార్త):**
దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని అలాంటి గ్రామాల్లో అన్ని విధాలా అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అనుక్షణం గ్రామంలో ఉండి ప్రజలతో మమేకమై సేవలు అందిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సేవలు అభినందనీయమని ఎంపిపి బాలేషంగౌడ్ అన్నారు. బుధవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషన్ కాలం ముగిసినందున మండలకేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి బాలేషంగౌడ్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సేవలను గుర్తించి త్వరలోనే రెగ్యులరైజేషన్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జిల్లా జెపిఎస్ సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ, పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పల్లె తిరుపతి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వేణు, కార్యదర్శి సత్యం, మహిళా అధ్యక్షులు మమత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బేతాళుని జాతర ఉత్సవాలు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని బేతాళ స్వామి జాతరఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ జాతర ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరై బేతాళుడిని దర్శించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల సందడి నెలకొంది. బేతాళుడికి ఉదయం నుండే మొక్కులు చెల్లించుకునేందుకు మహిళలు పెద్దఎత్తున బోనాలను సమర్పించారు. బేతాళ స్వామికి గోవిందా.. గోవిందా అంటూ ప్రదిక్షిణలు నిర్వహిస్తూ బోనాల ముందు శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలతో ఈ ప్రాంత మంగా మారోగింది. మెదక్‌జిల్లా వాసులే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే కాకుండా ప్రక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భారీ ఎత్తున భక్తులు వస్తున్నారు. నిత్యం ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిట కిటలాడుతుంది. మంగళవారం బండ్ల ఊరేగింపును తిలకించేందుకు అశేష జనం హాజరయ్యారు. ఈ జాతరఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు జాతర ప్రాధాన్యతను, ఆలయ విశిష్టతను, ప్రతి సంవత్సరం జరుగుతు ఉత్సవ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకు న్నారు.జాతర ఉత్సవాల్లో భాగంగా బేతాళ స్వామి ఆలయ ప్రాంగణంలో ఎక్కడ చూసిన భక్తుల సందడి నెలకొంది. భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులు పోటెత్తడంతో ఆలయంలో భక్తులు కదల్లేని పరిస్థితి నెలకొంది.

బేతాళస్వామికి తెలంగాణ సంప్రదాయంలో ప్రతి రోజు బోనాల ఊరేగింపు నిర్వహించిన తరువాతే జాతర బండ్ల ప్రధాన ఘట్టం నిర్వహించారు. బుధవారం కూడా వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మేకలను, గొర్రెలను, కోళ్లను బేతాళుడిని బలిఇచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. బేతాళ స్వామిని దర్శించుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో ఎండతాకిడి ఎక్కువగా ఉండటంతో సాయం త్రం వేళల్లో జాతరలో ఎక్కడ జన జాతరగా మారింది.

స్థానిక సర్పంచి అంజి యాదవ్ భక్తులకు నీటి సమస్య లేకుండా దగ్గరుండి ఏర్పాట్లు చూస్తు న్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇ.అనిల్‌కుమార్ రెడ్డి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.





ఆలయంలో కొలువుదీరిన బేతాళ స్వామి, ఆలయం వద్ద భక్తుల సందడి



నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్న సెంట్రింగ్ డబ్బాలు

## సెంట్రింగ్ డబ్బాలు దొంగతనం చేసిన వ్యక్తి రిమాండ్

**మిరుదొడ్డి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**
సెంట్రింగ్ డబ్బాలు ఎత్తుకెళ్లి అమ్మిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించినట్లు భూంపల్లి ఎస్ఐ గంగరాజు బుధవారం తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీ చేర్వాపూర్‌కు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ రాజు తన సెంట్రింగ్ డబ్బాలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసు స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి నంబర్ లేని బైక్ పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించగా రామక్కపేట గ్రామానికి చెందిన శనిగరం శ్రీకాంత్ భూంపల్లి డబుల్ బెడ్ రూంల నుంచి సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుని నుంచి 93 సెంట్రింగ్ డబ్బాలు రికవరి చేసినట్లు తెలిపారు. డబ్బాలు కొన్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో శ్రీకాంత్‌పై దుబ్బాక పోలీసు స్టేషన్‌లో 2 దొంగతనాల కేసులు ఉన్నాయని తెలిపారు. ఈమేరకు శనిగరం శ్రీకాంత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీలలో ఎఎస్ఐ బాలమల్లయ్య, కానిస్టేబుల్ సాయి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## బాధ్యతగా విధులు నిర్వహించాలి : ఎంపిడివో



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడివో

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించా లని ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మం డల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్బంగా ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా బాధ్యతగా వ్యవ హరిస్తూ, ప్రజలచేత మన్ననలను పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎపీవో వెంకటసాయి గౌడ్, సూపరిండెంట్ అశోక్, శ్రీలత, ప్రభాకర్ వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైన్స్ మెటీరియల్, పుస్తకాల పంపిణీ

**శివ్వంపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మురళిమోహన్ అన్నారు. గోమారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాధన సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ మెటీరియల్, గ్రంథాలయం పుస్తకాలను సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లావణ్య మాధవరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, పిల్లలందరికీ మంచి విద్యను అందించడంతో తమ సాధన సంస్థ సహకారం అందిస్తుందన్నారు. ఎల్లప్పుడు పిల్లల కోసం వారి హక్కుల అభివృద్ధి కోసం తమ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దొంతిరెడ్డి నర్సింహారెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ రమేష్, ప్రధానోపాధ్యాయులు కిషోర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెల వితరణ

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** మండల పరిధి మడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాములు,లక్ష్మీల కుమార్తె బార్గవి వివాహం బుధవారం నిర్వహించగా మైనంపల్లి స్వచ్ఛంధ సేవా సంస్థ చైర్మన్ మైనంపల్లి రోహిత్ పంపగా పట్టణ సర్పంచి రాజిరెడ్డి పుస్తె మెట్టెలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి జివన్,మడూర్ సర్పంచి నరసమ్మ, రమేష్ గౌడ్, విణ గౌడ్, రమేష్‌లు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** మండల పరిధి ధర్పల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు ఇందిరా(35) ఆర్థిక ఇబ్బందులతో బుధ వారం ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి స్వచ్ఛంధ సేవా సంస్థ చైర్మన్ మైనంపల్లి రోహిత్ బాధిత కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంపగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారికి అందించారు. ఆ కుటుంబాన్ని భవిష్యత్తులో అన్ని విదాలుగా ఆదుకుంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గణేష్,శ్రీనివాస్, రవి,జావిద్ తదితరులున్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**కొండపాక, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలో పొట్టొళ్ల పోశవ్వ సోమవారం ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ వార్డు మెంబర్ కర్ణాకర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ॥ 5వేలను ఆర్థిక సహాయంగా అందించారు. నిరు పేదలకు సహాయం చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందని తెలిపారు. ఆర్థిక వెసులుబాటు ఉన్నవారు నిరుపేదలకు ఏదో రూపంలో సహాయం అందించాలని కోరారు. ఆయన వెంట గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొరె చరణ్, వార్డు మెంబర్ దబ్బెట స్వామి, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు అశోక్, కొమురయ్య, ఐలయ్య, ఎల్లం, మహేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. తప్పిన ముప్పు

**కొల్చారం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** అతివేగంతో వెళ్లిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన కొల్చారం మండలం కిష్టాపూర్ వద్ద మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మల్లన్నగుడి మూలమలుపు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీబస్సు మెదక్ నుంచి హైదరాబాద్‌కు ఫిట్‌నెస్ కోసం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అకస్మాత్తుగా ముందుభాగం చక్రం ఊడిపోవ డంతో అదవు తప్పి బోల్తా పడినట్లు తెలిపారు. ఇందులో ప్రయాణిలు ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన బస్సును క్రేన్ సహాయంతో ప్రక్కకు తీశారు.




మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బోల్తా పడిన ఆర్టీసీ బస్సు